


మకర తోరణం వితరణ

చెరుకుపల్లి: పొన్నపల్లి ఎస్టీ కాలనీలోని కోదండ రామాంజనేయస్వామికి పిట్టు కృష్ణారెడ్డి తన కుమారుడు ఏడుకొండలరెడ్డి జ్ఞాపకార్థం మకర తోరణం, వెండి కళ్లు, రాళ్ల బొట్లు అందజేశారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం గురువారం 504.90అడుగుల వద్ద ఉంది. సాగర్ జలాశయం నుంచి ఎస్ఎల్‌బీసీకి 400 క్యూసెక్కులు విడుదలవుతోంది.



ఆశా వర్కర్లకు మొబైల్ ఫోన్లు

గుంటూరు మెడికల్: నూతనంగా విధుల్లో చేరిన ఆశా కార్యకర్తలకు గురువారం డీఎంహెచ్ఓ డాక్టర్ కొర్రా విజయలక్ష్మి కార్యాలయంలో మొబైల్ ఫోన్‌లు అందజేశారు.

న్యూస్‌రీల్

ఎన్నికల విధుల్లో అశ్రద్ధ వద్దు

ఎస్పీ వకుల్ జిందాల్



బాపట్ల టౌన్: ఎన్నికల విధుల్లో నిష్పక్షపాతంగా, నిబద్ధతతో వ్యవహరించాలని జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. జిల్లాకు కేటాయించిన మూడు టీఎస్ఎస్‌పీ, రెండు బీఎస్ఎఫ్ బెటాలియన్‌ల సాయుధ బలగాల అధికారులతో గురువారం తన కార్యాలయంలో సమావేశమయ్యారు. ఎస్పీ మాట్లాడుతూ స్వేచ్ఛగా ఓటుహక్కు వినియోగించుకునేలా ప్రజల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించాలని సూచించారు. సమస్యాత్మక గ్రామాల్లో ఫ్లాగ్ మార్చ్‌లు నిర్వహించి ప్రజలకు పోలీస్ శాఖ అండగా ఉందనే భరోసాను కల్పించాలని తెలిపారు. ఈవీఎంలు, వీవీప్యాట్లు భద్రపరిచే స్ట్రాంగ్ రూముల వద్ద పటిష్ట బందోబస్తుతో 24 గంటల పాటు అప్రమత్తంగా విధులు నిర్వహించాలని చెప్పారు. సమావేశంలో బీఎస్ఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్లు ఆర్.కె.భారతి, జి.డి.సంజయ్, తెలంగాణ స్పెషల్ పోలీస్ అసిస్టెంట్ కమాండెంట్లు టి.కాశీదాస్, సీతారాం, ఎం.శ్రీనివాసరావు, బాపట్ల ఏఆర్ డీఎస్పీ ఎస్.చంద్రమోహన్ పాల్గొన్నారు.

వైఎస్సార్ పింఛన్ కానుక 95.74 శాతం పంపిణీ



నరసరావుపేట: జిల్లాలో వైఎస్సార్ పింఛన్ కానుక గురువారం రాత్రి 8గంటలకు 95.74 శాతం పంపిణీ చేశారు. మొత్తం 2,81,240మందికి రూ.84.01కోట్లు పంపిణీ చేయాల్సి ఉండగా 2,69,252మందికి రూ.80.48 కోట్లు పంపిణీ చేశారు. డీఆర్‌డీఏ పీడీ బాలూనాయక్ నరసరావుపేట మండలం యల్లమంద, శావల్యాపురం, వినుకొండ, బొల్లాపల్లి ప్రాంతాల్లోని పలు బ్యాంకుల్లో లబ్ధిదారుల ఖాతాలకు పింఛన్ల జమ అయిన విధానం పరిశీలించారు. బ్యాంకు ఖాతాల నుంచి పింఛన్‌దారులు నగదు విత్‌డ్రా చేసుకునేందుకు ఏర్పాట్లు చేశారు.

మద్యం అక్రమాలపై దృష్టి సారించండి



నరసరావుపేట టౌన్: మద్యం ప్రభావం ఎన్నికల మీద చూపకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌బ్యూరో డిప్యూటీ కమిషనర్ కె.హేమంత్‌నాగరాజు ఆదేశించారు. గురువారం ఎస్ఈబీ కార్యాలయాన్ని సందర్శించిన ఆయన అధికారులను ఉద్దేశించి మాట్లాడారు. అనుమానిత ప్రదేశాల్లో దాడులు నిర్వహించాలన్నారు. అనధికార మద్యం విక్రయాలు, అక్రమ మద్యంపై ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండి పూర్తి నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. మద్యం కేసుల్లో నిందితులపై బైండోవర్ కేసులు నమోదు చేయాలని చెప్పారు. కార్యక్రమంలో ఈ.ఎస్.ఖాజామోహిద్దిన్, సీఐ నయనతార, సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయ అథ్లెటిక్స్‌లో రేష్మీకి బంగారు పతకం



గుంటూరు వెస్ట్ (క్రీడలు): ఇటీవల బెంగళూరులో జరిగిన ఇండియన్ గ్రాండ్ ప్రిక్స్-1 జాతీయ అథ్లెటిక్ పోటీల్లో భాగంగా జావెలిన్ త్రో విభాగంలో గుంటూరు అథ్లెట్ రేష్మి బంగారు పతకం సాధించిందని అథ్లెటిక్ అసోసియేషన్ ఆఫ్ గుంటూరు జిల్లా కార్యదర్శి జీవీఎస్ ప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 53.77 మీటర్లు దూరం జావెలిన్ విసిరి తనకు ఎదురులేరని నిరూపించిందన్నారు. గతంలో కూడా రేష్మి పలు జాతీయ పోటీల్లో పాల్గొందన్నారు. ప్రస్తుతం ఆమె సౌత్ సెంట్రల్ రైల్వే టికెట్ కలెక్టర్‌గా పని చేస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా రేష్మిని అసోసియేషన్ చైర్మన్ జి.శేషయ్య, రేమండ్స్ అధినేత టి.అరుణ్ కుమార్, డాక్టర్ ఎం.శివకుమార్, అంకాల సుబ్బారావు అభినందించారని పేర్కొన్నారు.

నిమ్మకాయల ధరలు

తెనాలి: గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్ యార్డులో గురువారం క్వింటా నిమ్మకాయలు కనిష్ట ధర రూ.4500, గరిష్ట ధర రూ.6800, మోడల్ ధర రూ.5400 వరకు పలికింది.

చంద్రబాబు నిర్వాకం ▸ వృద్ధులకు శాపం

చంద్రబాబు నిర్వాకం వల్ల పండుటాకులకు ఈనెలా పింఛన్ కష్టాలు తప్పలేదు. బ్యాంకుల వద్ద పడిగాపులు పడ్డారు. మండుటెండలో మలమల మాడిపోయారు. జగనన్న పాలనలో తెలతెలవారగనే తలుపు తట్టి వలంటీర్లు నగదు చేతిలో పెట్టేవారు. ఒకటి కాదు రెండు నెలలు కాదు.. గత ఐదేళ్లుగా పువ్వుల్లా నగదు చేతిలో పెట్టడంతో వృద్ధులు సంబర పడిపోయారు. జగనన్న పాలనకు జేజేలు పలికారు. ఇది చంద్రబాబుకు కన్నుకుట్టింది. ఎన్నికల్లో ఓడిపోతానని భయం పట్టుకుంది. బృహన్నలలా నిమ్మగడ్డను అడ్డం పెట్టుకుని వలంటీర్ల ద్వారా పింఛన్ల పంపిణీకి అడ్డుకట్ట వేశాడు. జీవిత చరమాకంలో ఉన్న వృద్ధులు బాబు ఉక్రోషంతో గత నెల పింఛన్ తీసుకోవడానికి నరకయాతన అనుభవించారు. బతుకు జీవుడా అనుకున్నారు. అయితే, ఈనెల కూడా వారికి యాతన తప్పలేదు. అధికారులు పింఛన్ సొమ్మును ఖాతాల్లో జమ చేయడంతో వృద్ధులు బ్యాంకుల వద్ద మండుటెండలో పడిగాపులు పడుతున్నారు. బాబు నిర్వాకం వల్లే తామంతా రోడ్డున పడ్డామని శాపనార్థాలు పెడుతున్నారు. ఎన్నికల్లో జగనన్నకు ఓటేసి రుణాన్ని తీర్చుకుంటామని చెబుతున్నారు.

– సాక్షి నెట్‌వర్క్

పింఛన్ టెన్షన్



బల్లికురవ బ్యాంకులో వృద్ధుల పడిగాపులు

ఏ బ్యాంకుకు వెళ్లాలో తెలియలేదు



వయస్సు అయిపోయిన వాళ్లు ఎక్కడికి పోవాలి. నాకు రెండు బ్యాంక్ అకౌంట్ నంబర్లు ఉన్నాయి. ఉదయం నుంచి పంగులూరు ఎస్‌బీఐ వద్ద లైన్‌లో నుంచున్నా. పుస్తకం చూపించి డబ్బులు అడగ్గా సిబ్బంది పడలేదన్నారు. అక్కడ నుంచి మరో బ్యాంక్ బ్యాంక్ ఆఫ్ బరోడాకు వెళ్లి అడగ్గా అక్కడా పడలేదన్నారు. సచివాలయ సిబ్బందిని అడిగితే డబ్బులు బ్యాంకులో పడ్డాయన్నారు. ఏం చెయ్యాలో అర్థం కావడం లేదు.

– ఇస్తర్ల హనుమాయమ్మ, చిన్నమల్లవరం, జే.పంగులూరు మండలం

కష్టాలు తెచ్చి పెట్టాడు



వలంటీర్ ఒకటో తేదీ తెల్లవారు జామునే నిద్ర లేపి పింఛన్ సొమ్ము ఇచ్చేవాడు. చంద్రబాబు పుణ్యామా అంటూ రెండు నెలలుగా సొమ్ము సకాలంలో అందడం లేదు. పనులు మానుకుని పడిగాపులు కాస్తున్నాం. ఈ కష్టాలు మరో నెల భరించాలి. అయ్యా బాబు మేమేం పాపం చేశాం. నీ రాజకీయాలకు మేం బలయ్యాం.

– వల్లెపు నాంచారమ్మ, కొప్పరపాడు, బల్లికురవ మండలం

ఎండలో ప్రాణాలు పోయేట్టున్నాయి



అయ్యా.. చీకట్లోనే వలంటీర్లు పింఛను సొమ్ము తెచ్చిచ్చే వారయ్యా.. నాలుగేండ్లుగా నాకు ఎటువంటి ఇబ్బంది లేకుండా వచ్చేది. అట్టాంటిది ఈ రోజు భరించలేని ఎండలో పడి వచ్చాను. నడవలేని స్థితిలో ఇద్దరు సాయంతో రావాల్సి వచ్చింది. బాబుకు మా ఉసురు తగుల్తుంది.

– కామాక్షమ్మ, చినగంజాం

ఎండలో చంద్రబాబు చంపుతున్నాడు



ఇంటికొచ్చి పింఛన్ ఇచ్చే వలంటీర్లను తీసేసి చంద్రబాబు ముసలోళ్లను ఎందుకు చంపుతున్నాడు. ఉదయాన్నే వచ్చినా గంటల కొద్ది ఉండాలంటే మాకు ఓపికెక్కడుంది. నేను చంద్రబాబుకు ఓటు వేయను. ఈ ఉసురు ఊరకే పోదు. మళ్లీ జగన్ ప్రభుత్వం రావాలి. వంటీర్లతో ఇంటి వద్దనే పింఛన్ తీసుకోవాలి.

– పొదిలి కోటయ్య, రామాయపాలెం, అద్దంకి మండలం

ఐదు కిలోమీటర్ల నడక



పింఛన్ సొమ్ము పొందేందుకు ఐదు కిలోమీటర్ల దూరంలో ఉన్న కొమ్మాలపాడు కెనరా బ్యాంకుకు వెళ్లి క్యూలైన్లో ఐదు గంటలు నిలుచున్నా. ఈ కష్టాలు చంద్రబాబు వల్లే వచ్చాయి. మా మనవడు జగన్ అధికారంలోకి వస్తాడు. మాకు ఇంటికి వచ్చి పింఛన్ ఇస్తారన్న నమ్మకం ఉంది.

– నరసమ్మ, రామాంజనేయపురం, బల్లికురవ మండలం

ఎన్నడూ లేని బాధలు పడుతున్నాం



మా ఊరిలో బ్యాంకు సౌకర్యం లేదు. మాలాంటి వారు ఫించన్ తీసుకోవాలంటే ఐదు కిలోమీటర్లు వెళ్లి ఈపురుపాలెంలో గానీ, బుర్లవారిపాలెం బ్యాంకు వచ్చి పింఛన్ తీసుకోవాలి. ఉదయాన్నే బ్యాంకు వద్దకు వస్తే మీ ఖాతాలో డబ్బులు పడ్డాయో లేదో చూసుకుని రేపు రమ్మన్నారు. నా ఖాతాలో డబ్బులు పడ్డాయని తెలిసి మధ్యాహ్నానికి వెళ్లా. పింఛన్ ఇంకా ఇవ్వలేదు. ఇప్పటికీ రెండుసార్లు వచ్చి తిరిగివెళ్తున్నా. ఇది చంద్రబాబుకు న్యాయం కాదు.

– నూతక్కి సాంబశివరావు, పిట్టవారిపాలెం, చీరాల

మళ్లీ వలంటీర్లే పింఛన్ ఇవ్వాలి



ప్రతి నెలా కష్టం లేకుండా ఠంఛనుగా పింఛను తెచ్చి ఇచ్చి వెళ్లేవారు వలంటీరు. అలాంటిది బ్యాంకులో డబ్బులు జమ చేసి మండు వేసవిలో మమ్మల్ని తీవ్రంగా ఇబ్బందులు పెడుతున్నారు. ఇంత కష్టం తెచ్చిపెట్టే చంద్రబాబు మా కొద్దు.

-కత్తుల రమణ, మున్నంవారిపాలెం, చినగంజాం మండలం

జిల్లావ్యాప్తంగా ఫెసిలిటేషన్ కేంద్రాల ఏర్పాటు

బాపట్ల: ఎన్నికల్లో విధులు నిర్వహిస్తూ పోస్టల్ బ్యాలెట్‌కు దరఖాస్తు చేసుకున్న వారంతా సొంత నియోజకవర్గాల్లో ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ కేంద్రాల ద్వారా ఓటుహక్కుని వినియోగించుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి పి. రంజిత్ బాషా గురువారం ఒక ప్రకటనలో సూచించారు. 85 సంవత్సరాలు దాటిన వృద్ధులు, దివ్యాంగులు ఇంటి వద్దనే ఓటు వేసే అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. మే 5,6 తేదీల్లో ప్రిసైడింగ్ అధికారులు, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులు, సూక్ష్మ పరిశీలకులు, ఓపీఓలు కింద పేర్కొన్న ఫెసిలిటేషన్ కేంద్రాల్లో ఓటుహక్కును వినియోగించుకోవాలని కలెక్టర్ తెలిపారు.

జిల్లాలో ఫెసిలిటేషన్ కేంద్రాలు

వేమూరు నియోజకవర్గానికి చెందిన వారు వేమూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో, రేపల్లె నియోజకవర్గానికి చెందిన వారు రేపల్లెలోని క్రిస్టియన్ కళాశాలలో, బాపట్ల నియోజకవర్గానికి చెందిన వారు పట్టణంలోని సత్యనారాయణపురం యాదవపాలెం మున్సిపల్ హైస్కూలులో, పర్చూరుకు చెందిన వారు ఎస్ఎఫ్ఎస్ హైస్కూలు నాగులపాలెం పాఠశాలలో, అద్దంకికి చెందిన వారు ఆర్ అండ్ బీ గెస్ట్‌హౌస్ పక్కన ఉన్న ప్రకాశం గవర్నమెంట్ జూనియర్ కళాశాల్లో, చీరాలకు చెందిన వారు మున్సిపల్ కార్యాలయం వద్ద ఉన్న యార్లగడ్డ అక్కమాంబ మహిళా కళాశాల్లో ఓటుహక్కును వినియోగించుకోవాలని సూచించారు.

✦ పోలీసులు, అత్యవసర సేవల విభాగాల వారు, డ్రైవర్లు, క్లీనర్లు, వీడియోగ్రాఫర్లు, ఇతర ఎన్నికల విధులు నిర్వహిస్తున్న వారంతా నియోజకవర్గంలోని రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో పోస్టల్ బ్యాలెట్ సదుపాయాన్ని వినియోగించుకోవాలని కలెక్టర్ సూచించారు.

✦ బాపట్ల జిల్లాలో ఎన్నికల విధులు నిర్వహిస్తూ ఇతర జిల్లాలో ఓటుహక్కు కలిగి ఉన్న వారందరూ మే 7, 8 తేదీల్లో బాపట్ల ఇంజినీరింగ్ కాలేజీలో ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ కేంద్రంలో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోస్టల్ బ్యాలెట్ సదుపాయాన్ని వినియోగించుకోవాలని సూచించారు.

ప్రణాళికాబద్ధంగా పనిచేస్తే విజయం మనదే..

వైఎస్సార్ సీపీ అభ్యర్థి కరణంతో రీజినల్ కోఆర్డినేటర్, ఎంపీ ఆళ్ల అయోధ్య రామిరెడ్డి

చీరాల టౌన్: 'మరో పది రోజుల్లో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో ప్రణాళికాబద్ధంగా పనిచేసి, అధిక శాతం పోలింగ్ చేయించేలా కృషి చేయండి.. ఎలాంటి ఒత్తిడికి లోను కావద్దు.. విజయం మనదే'నంటూ రాజ్యసభ సభ్యుడు, పార్టీ రీజినల్ కోఆర్డినేటర్ ఆళ్ల అయోధ్య రామిరెడ్డి సూచించారు. మండలంలోని రామకృష్ణాపురంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గురువారం చీరాల ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి, అసెంబ్లీ అభ్యర్థి కరణం వెంకటేష్‌లను ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు. చీరాల నియోజకవర్గంలో పార్టీ పరిస్థితులు, ఎన్నికల్లో తీసుకుంటున్న ప్రణాళికలు, పలు అంశాలపై ఎంపీ అయోధ్య రామిరెడ్డి చర్చించారు. నియోజకవర్గంలోని చీరాల, వేటపాలెం మండలాలతో పాటు చీరాల మున్సిపాలిటీలో గత ఐదేళ్లుగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పలు అభివృద్ధి పనులు చేసిందని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు అందించినట్లు చెప్పారు. ప్రతి ఓటర్‌ను కలిసి, మంచి చేసిన జగనన్నకు అండగా నిలవాలని ఓట్లు అభ్యర్థించాలని సూచించారు. ఓటర్లంతా ఫ్యాన్ గుర్తుపై ఓట్లు వేసేలా ప్రచారం చేయాలని చెప్పారు. పార్టీ కార్యకర్తలంతా సమర్థంగా పని చేసి, చీరాల్లో వైఎస్సార్ సీపీ జెండా ఎగరేయాలని ఆయన పిలుపునిచ్చారు. కరణం వెంకటేష్ ఎమ్మెల్యేగా విజయం సాధించడంతో పాటుగా సీఎంగా మళ్లీ జగన్ మోహన్‌రెడ్డి అధికారం చేపట్టనున్నారని ఆయన ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ మోదుగుల వేణుగోపాల రెడ్డి, అద్దంకి అసెంబ్లీ అభ్యర్థి పానెం చినహనిమిరెడ్డి, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



కరణం వెంకటేష్‌తో కరచాలనం చేస్తున్న ఎంపీ అయోధ్య రామిరెడ్డి. పక్కన ఎమ్మెల్యే బలరాం

నేడు క్రోసూరుకు సీఎం వైఎస్ జగన్



క్రోసూరు మెయిన్‌రోడ్డులో సభ జరిగే ప్రదేశాన్ని పరిశీలిస్తున్న సీఎం ప్రోగ్రాం కో ఆర్డినేటర్ తలశిల రఘురాం, ఎమ్మెల్యే నంబూరు శంకరరావు

- మధ్యాహ్నం 12 గంటలకు బహిరంగ సభ
- వైఎస్సార్‌సీపీ అభిమానుల జోష్
- ఏర్పాట్లను పరిశీలించిన సీఎం ప్రోగ్రాం కోఆర్డినేటర్ తలశిల రఘురాం, ఎమ్మెల్యే నంబూరు శంకరరావు

సాక్షి, నరసరావుపేట: ఎన్నికల ప్రచారంలో భాగంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శుక్రవారం పల్నాడు జిల్లా పెదకూరపాడు నియోజకవర్గంలోని క్రోసూరు రానున్నారు. పట్టణంలోని ప్రధాన రహదారి (తహసీల్దార్ కార్యాలయం వెళ్లే రోడ్డు)లో మధ్యాహ్నం 12 గంటలకు నిర్వహించే బహిరంగసభలో వైఎస్సార్ సీపీ శ్రేణులు, అభిమానులు, ప్రజలనుద్దేశించి ప్రసంగించనున్నారు. జిల్లాలో ఇటీవల నిర్వహించిన మేమంతా సిద్ధం బస్సు యాత్ర విజయవంతమైన రీతిలోనే క్రోసూరు సభను సక్సెస్ చేసేందుకు పార్టీ శ్రేణులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఎన్నికల ముంగిట ముఖ్యమంత్రి జిల్లాలో జరపనున్న పర్యటన వైఎస్సార్‌సీపీ అభిమానుల్లో జోష్ నింపనున్నది. మరింత ఉత్సాహంతో పనిచేసేందుకు సమాయత్తం కానున్నారు.

ఏర్పాట్లు పరిశీలించిన తలశిల రఘురాం

వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బహిరంగసభ ఏర్పాట్లను గురువారం సీఎం ప్రోగ్రాం కో ఆర్డినేటర్, ఎమ్మెల్సీ తలశిల రఘురాం పర్యవేక్షించారు. ఆయనతోపాటు స్థానిక ఎమ్మెల్యే నంబూరు శంకరరావు, యువ నాయకులు నంబూరు కళ్యాణ్ చక్రవర్తి క్రోసూరు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో సీఎం హెలీప్యాడ్‌కు అనువైన స్థలంగా గుర్తించి, తీసుకోవాల్సిన చర్యలపై సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం క్రోసూరు మెయిన్ రోడ్డు నుంచి తహసీల్దార్ కార్యాలయం వెళ్లే రోడ్డులో బహిరంగసభ జరిగే ప్రాంతాన్ని పరిశీలించారు.

కట్టుదిట్ట భద్రత

సీఎం పర్యటన నేపథ్యంలో జిల్లా పోలీసులు కట్టుదిట్ట భద్రతా ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లా ఎస్పీ బిందుమాధవ్ సీఎం హెలీప్యాడ్ ఏర్పాటుచేసిన గ్రౌండ్, బహిరంగసభ జరిగే ప్రాంతాలను పరిశీలించారు. బారికేడ్లు ఏర్పాటు తదితర విషయాలపై సిబ్బందికి సూచనలు చేశారు. హెలీప్యాడ్ నుంచి సభ వరకు సీఎం కాన్వాయ్ వెళ్లే మార్గంలో పటిష్ట బందోబస్తు చేయనున్నారు. మెయిన్ రోడ్డుకు ఇరువైపులా భారీ భవంతులను ఇప్పటికే పోలీసులు తమ ఆధీనంలోకి తీసుకుని భద్రతను పర్యవేక్షిస్తున్నారు. ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా ఎస్పీ పోలీసు సిబ్బందికి సూచనలు చేశారు. జిల్లా అడిషనల్ ఎస్పీలు రాఘవేంద్ర, లక్ష్మీపతి, రామచంద్రరాజు పాల్గొన్నారు.

చంద్రబాబు మేనిఫెస్టో ఒట్టి మాయ

- వైఎస్సార్ సీపీ ప్రభంజనం ఖాయం
- ఒక్కసారే మోసపోతాం.. మళ్లీ మళ్లీ కాదంటున్న జనం
- ఎన్నికల ప్రచారంలో అద్దంకి అసెంబ్లీ అభ్యర్థి పానెం చిన హనిమిరెడ్డి

జే.పంగులూరు: సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ప్రభంజనం ఖాయమని అద్దంకి వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పానెం చిన హనిమిరెడ్డి స్పష్టం చేశారు. మండల పరిధిలోని జాగర్లమూడి వారిపాలెంలో గురువారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గ్రామస్తులు బ్రహ్మరథం పట్టారు. గ్రామంలో ప్రతి ఇంటికీ వెళ్లి సమస్యలు తెలుసుకున్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అందిన సంక్షేమ పథకాల కరపత్రాల్ని పంపిణీ చేశారు. ఫ్యాన్ గుర్తుకి ఓటు వేయాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ చంద్రబాబు మేనిఫెస్టో నమ్మే విధంగా లేదని తేల్చి చెప్పారు. ఇచ్చిన వాగ్దానాలు నిలబెట్టుకున్న వైఎస్సార్ సీపీ వెంటే తాము నడుస్తామని స్పష్టం చేశారు. అనంతరం హనిమిరెడ్డి మాట్లాడుతూ జగనన్న నేతృత్వంలోని వైఎస్సార్ సీపీ ఎంత బలంగా ఉందో చంద్రబాబుకు తెలుసని, అందుకే జనసేన, బీజేపీతో పొత్తు పెట్టుకున్నారని విమర్శించారు.

అంతర్గతంగా కాంగ్రెసుతో లాలూచీ

అంతర్గతంగా చంద్రబాబు కాంగ్రెసుతోనూ లాలూచీ పడ్డాడని చిన హనిమిరెడ్డి ఆరోపించారు. అయినా లాభం లేదని మేనిఫెస్టోలో సాధ్యంకాని హామీలు గుప్పించి ప్రజల్ని మోసం చేసేందుకు వస్తున్నారన్నారు. ప్రజలు దానిని సైతం తిప్పికొడుతున్నారని తెలిపారు. విశ్వసనీయత ఉన్న వైఎస్సార్ సీపీ వెంటే ప్రజలు ఉన్నారని, ఎన్నికల్లో జగనన్న మరో ప్రభంజనం సృష్టించడం తథ్యం అని స్పష్టం చేశారు. అద్దంకి నుంచి వైఎస్సార్ సీపీ తరఫున తనను, ఎంపీ అభ్యర్థి నందిగం సురేష్‌ను అత్యధిక ఓట్లతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ స్వయంపు హనుమంతరావు, వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జి బిజ్జం శ్రీనివాసరెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ పులికం కోటిరెడ్డి, జంపాని రవిబాబు, బత్రాజుల సంఘం రాష్ట్ర కార్పొరేషన్ డైరెక్టర్ చక్రవరం జ్యోతి, వడ్డెర సంఘం రాష్ట్ర కార్పొరేషన్ డైరెక్టర్ పల్లపు రాము, సర్పంచ్ జాగర్లమూడి వెంకటరత్నం, గ్రామ నాయకులు జాగర్లమూడి యల్లమందరావు, ఉప సర్పంచ్ జరుగుల యల్లమందరావు పాల్గొన్నారు.



జాగర్లమూడివారిపాలెంలో ఓట్లు అభ్యర్థిస్తున్న చిన హనిమిరెడ్డి

ప్రచార పర్వం



అధికారం కోసం అడ్డదారులు తొక్కడం, బూటకపు హామీలతో ప్రజల్ని మోసగించడం చంద్రబాబునాయుడుకు అలవాటేనని రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు విమర్శించారు. రేపల్లె మండలంలోని కైతేపల్లి నుంచి ఊలుపాలెం వరకు గురువారం సాయంత్రం జరిగిన ఎన్నికల ప్రచారంలో వైఎస్సార్ సీపీ నియోజకవర్గ అభ్యర్థి డాక్టర్ ఈవూరు గణేష్‌తో కలసి ఆయన పాల్గొన్నారు.

-రేపల్లె రూరల్



వైఎస్సార్ సీపీ మేనిఫెస్టో నిజమని, కూటమి మేనిఫెస్టో మొత్తం మోసపూరితమైందని చీరాల వైఎస్సార్ సీపీ అసెంబ్లీ అభ్యర్థి కరణం వెంకటేష్ విమర్శించారు. మున్సిపాలిటీలోని 17 వార్డులో గురువారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రతి ఇంటికీ వెళ్లి జగనన్న ప్రభుత్వంలో జరిగిన మేలుని వివరించి, ఓట్లను అభ్యర్థించారు.

- చీరాల



సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ప్రభంజనం ఖాయమని అద్దంకి వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పానెం చిన హనిమిరెడ్డి స్పష్టం చేశారు. గురువారం మండల పరిధిలోని జాగర్లమూడివారిపాలెంలో చిన హనిమిరెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గ్రామస్తులు బ్రహ్మరథం పట్టారు.

- జె.పంగులూరు

క్లుప్తంగా

బీసీల ఆశాజ్యోతి జగన్



విలేకరులతో మాట్లాడుతున్న బీసీ సంఘం జేఏసీ నాయకులు

మాచర్ల: రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక విప్లవాత్మకమైన మార్పులు తీసుకువచ్చి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు 50 శాతం నామినేటెడ్, ప్రజా ప్రతినిధుల పదవులు కేటాయించిన ఘనత భారతదేశ చరిత్రలో లేదని, ఆ ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికే దక్కుతుందని గుంటూరు ఉమ్మడి జిల్లా బీసీ వెల్ఫేర్ సంఘ అధ్యక్షుడు అంగిరేకుల ఆదిశేషు, జిల్లా ఉపాధ్యక్షుడు రవికుమార్, యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ కామనబోయిన కోటయ్య, మాజీ ఎంపీపీ దాసరి చౌడేశ్వరి, న్యాయవాది సంఘ నాయకులు జీవి అన్నారు. గురువారం క్యాంపు కార్యాలయంలో సీఎం జగన్‌కు, వైఎస్సార్‌సీపీ నర్సరావుపేట పార్లమెంట్ అభ్యర్థి అనిల్‌కుమార్ యాదవ్, ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డిలకు మద్దతుగా వారు నియోజక వర్గంలో విస్తృతంగా ప్రచార కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు ఏనాడూ బీసీలను పట్టించుకోలేదన్నారు. బీసీల కోసం ఒక్క హామీ ఇవ్వకుండా చట్ట సభల్లో బీసీలకు ప్రాతినిత్యం కల్పించకుండా కుట్రలు చేసిన ఘనత చంద్రబాబుదేనన్నారు. ఎన్నికలొచ్చినప్పుడే బీసీల ఓట్లు ఆయనకు గుర్తుకు వస్తాయన్నారు. ఉమ్మడి మేనిఫెస్టో పేరుతో కూటమి ముందుకొచ్చి బీసీలను మరోసారి మోసగించే పరిస్థితి ఉందన్నారు. నియోజక వర్గ వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు మల్లిఖార్జున్‌యాదవ్, బిసి సంఘ నాయకులు సాయి, వడ్డెంగుంట శివ, నరసింహారావు, తాళ్ళ కొండలు, లాల్ గౌడ్, తేరాల సర్పంచ్ నాగబ్రహ్మం, మహిళా అధ్యక్షురాలు ఆదిరాల నాగమణి, తాతారావు, రామకృష్ణతో పాటు బీసీ నాయకులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ ప్రభుత్వంతోనే రాష్ట్రం సుభిక్షం

- ఎంపీ మోపిదేవి వెంకట రమణారావు
- రేపల్లె మండలంలో వైఎస్సార్ సీపీ అభ్యర్థి ఈవూరి గణేష్ విస్తృత ప్రచారం



బొబ్బర్లంక ప్రచారంలో అభివాదం చేస్తున్న అభ్యర్థి డాక్టర్ ఈవూరి గణేష్, ఎంపీ మోపిదేవి

రేపల్లె రూరల్: అధికారం కోసం అడ్డదారులు తొక్కటం, బూటకపు హామీలతో ప్రజలను మోసగించడం చంద్రబాబు నాయుడుకి అలవాటేనని రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు విమర్శించారు. మండలంలోని కైతేపల్లి నుంచి ఊలుపాలెం వరకు గురువారం నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో వైఎస్సార్ సీపీ రేపల్లె నియోజకవర్గ అభ్యర్థి డాక్టర్ ఈవూరు గణేష్‌తో కలిసి ఆయన పాల్గొన్నారు. అధికారం కోసం టీడీపీ ప్రకటించిన మేనిఫెస్టో అమలుకు నమ్మశక్యంగా లేదని ప్రజలే బహిరంగంగా విమర్శిస్తున్నారన్నారు. చంద్రబాబు మాయ మాటలకు 2014లో అంతకు ముందూ మోసపోయామని, మరోమారు మోసపోమని ప్రజలు చెబుతున్నట్లు పేర్కొన్నారు. జగనన్న నవరత్నాల పథకాలు విజయవంతంగా అమలు చేస్తుంటే విషయం కక్కి.. నేడు అవే పథకాలను తన మేనిఫెస్టోలో చంద్రబాబు పెట్టడంపై ప్రశ్నించారు. జగనన్న అమలు చేస్తే శ్రీలంక అవుతుంది, చంద్రబాబు అమలు చేస్తే అమెరికా అవుతుందా అని ప్రజలే ప్రశ్నిస్తున్నారన్నారు. మే 13న జరిగే ఎన్నికల్లో ఫ్యాను గుర్తుపై రెండు ఓట్లు వేసి, వైఎస్సార్ సీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు నందిగం సురేష్, డాక్టర్ ఈవూరి గణేష్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు. వైఎస్సార్ సీపీ నియోజకవర్గ అభ్యర్థి డాక్టర్ ఈవూరి గణేష్ మాట్లాడుతూ వైఎస్ జగన్ మళ్లీ ముఖ్యమంత్రి అయితేనే ప్రజా సంక్షేమ పథకాలు విజయవంతంగా ప్రజల ముంగిటకు అందుతాయని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా కైతేపల్లి, చోడాయపాలెం, బొబ్బర్లంక, విశ్వేశ్వరం, సింగుపాలెం, నల్లూరుపాలెం, ఊలుపాలెం ఎన్నికల ప్రచారంలో ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. ప్రజలు ఘనస్వాగతం పలికారు. వైఎస్సార్ సీపీ రూరల్ కన్వీనర్ గాదె వెంకయ్యబాబు, సర్పంచ్‌ల ఫోరం మండలాధ్యక్షుడు మండలి అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణకు సహకరించండి



రేపల్లె రూరల్: సార్వత్రిక ఎన్నికల నిర్వహణకు పోలీసు శాఖ సిద్ధంగా ఉందని రేపల్లె డీఎస్పీ తక్కెళ్ల పాటి మురళీకృష్ణ చెప్పారు. సార్వత్రిక ఎన్నికలను పురస్కరించుకుని ప్రత్యేక పోలీసు బలగాలతో గురువారం పట్టణంలో పోలీసు కవాతు నిర్వహించి మాట్లాడారు. ఎన్నికలకు సాధారణ పోలీసు సిబ్బందితో పాటు ప్రత్యేక బలగాలు సిద్ధంగా ఉన్నాయన్నారు. ఓటర్ల కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించటంతో పాటు తమ సిబ్బందితో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయటం జరుగుతుందని చెప్పారు. ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించు కునేందుకు స్వేచ్ఛాయుత వాతావరణం కల్పించడం జరుగుతుందన్నారు. పట్టణ, రూరల్ సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

మేలు చేస్తున్న జగనన్నకే ఓటు వేయండి



కర్లపాలెం: ప్రజలకు మేలు చేస్తున్న జగనన్నకే ఓటు వేయాలని ప్రముఖ సినీ రచయిత కోన వెంకట్ కోరారు. వైఎస్సార్ సీపీ బాపట్ల ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు కోన రఘుపతి, నందిగం సురేష్‌లకు మద్దతుగా ఆయన గురువారం ఏట్రవారిపాలెంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కోన వెంకట్ స్థానిక నాయకులతో కలసి ప్రతి ఇంటికీ వెళ్లి వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరించారు. రాజకీయాలకు, కులమతాలకు అతీతంగా అర్హులకు సంక్షేమ పథకాలందించిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఒక్కరేనని పేర్కొన్నారు. అలవికాని హామీలతో చంద్రబాబు నాయుడు ప్రజలను మోసం చేసేందుకు మళ్లీ కూటమితో ప్రజల ముందుకు వస్తున్నారని, ప్రజలు గమనించి సరైన నిర్ణయం తీసుకోవాలని హెచ్చరించారు. వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు ఏడుకొండలు, నాయకులు సత్యనారాయణరెడ్డి, రెడెంకారెడ్డి, అయ్యప్పరెడ్డి, వెంకన్నరెడ్డి, సురేష్, సుబ్బారెడ్డి, అమీర్‌బేగ్, ఆసిఫ్ అలీ, ఇసాక్ ఉన్నారు.

జగనన్న మేనిఫెస్టో కల్పతరువు

వేమూరు వైఎస్సార్ సీపీ అభ్యర్థి వరికూటి అశోక్‌బాబు



సుగ్గునలంక ప్రచారంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అభ్యర్థి వరికూటి అశోక్‌బాబు



గాజుల్లంకలో కండువాలు కప్పి ఆహ్వానిస్తున్న అశోక్‌బాబు

కొల్లూరు: జగనన్న మేనిఫెస్టో పేద వర్గాల కల్పతరువు అని, చంద్రబాబు మేనిఫెస్టో ఎండమావి లాంటిదని వేమూరు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వరికూటి అశోక్‌బాబు పేర్కొన్నారు. గురువారం మండలంలోని లంక గ్రామాల్లో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. చంద్రబాబు ప్రజలను మభ్యపెట్టేందుకు ప్రకటిస్తున్న పథకాలను, మేనిఫెస్టోను ప్రజలు నమ్మే పరిస్థితుల్లో లేరన్నారు. గతంలో ఎన్నడూ చంద్రబాబు సంక్షేమ పథకాలు అమలుచేయకపోవడం, హామీలను నెరవేర్చకపోవడం ఇందుకు నిదర్శనమన్నారు. కాపు సామాజిక వర్గానికి చంద్రబాబు చేసిన అన్యాయానికి ప్రజానేత వీఎం రంగా హత్య ఓ నిదర్శనమైతే, ముద్రగడ పద్మనాభం కుటుంబానికి అవమానం మరో సాక్ష్యమన్నారు. తన ఓటు తానే వేసుకోలేని, ఓటు విలువ తెలియని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి నక్కా ఆనంద బాబుకు ప్రజలు తగిన గుణపాఠం నేర్పాలని కోరారు. వైఎస్సార్ సీపీ శ్రేణులు, అభిమానుల నడుమ చిలుమూరు లంక, సుగ్గున లంక, ఈపూరు లంక, చింతర్లంక, పెదలంక, పెసర్లంక, ఆవులవారిపాలెం, గాజుల్లంక గ్రామాల్లో ఉత్సాహంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మండుటెండను కూడా లెక్కచేయని ప్రజలు అశోక్‌బాబుకు సాదర స్వాగతం పలికారు. తమ సంపూర్ణ మద్దతు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ సూర్యదేవర రామకృష్ణ, జేసీఎస్ మండల కన్వీనర్ సుబ్బారావు, వైస్ ఎంపీపీ రాంబాబు, సర్పంచ్‌లు వెంకట్రావు, శ్రీకాంత్, వెంకటసుబ్బారావు, నీలాంబరం, ఎంపీటీసీలు అశోక్, వెంకట్రామయ్య, శ్రీధర్, నవరత్నం, కో–ఆప్షన్ సభ్యుడు బాజి, గాజుల్లంక సొసైటీ బ్యాంక్ చైర్మన్, డైరెక్టర్లు నాగేశ్వరరావు, రామకృష్ణ, మాజీ ఎంపీపీ పద్మారావు, మాజీ సర్పంచ్‌లు మల్లేశ్వరరావు, సోమయ్య, రామలింగేశ్వరరావు, నాయకులు రాంబాబు, కృష్ణప్రసాద్, మోహన్, లాజర్, శ్రీనివాసరావు, రత్నకుమార్, సుబ్రమణ్యం, కోటేశ్వరరావు, మోషే, మధు, ప్రకాశం, రత్నకుమార్, బుజ్జి, కోటేశ్వరరావు, రంగారావు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలో జోరుగా చేరికలు

మండలంలోని గాజుల్లంకలో వైఎస్సార్ సీపీ వేమూరు ఎమ్మెల్యే అభ్యర్థి వరికూటి అశోక్‌బాబు సమక్షంలో టీడీపీ, జనసేన మద్దతుదారులైన పది కుటుంబాల వారు గురువారం వైఎస్సార్ సీపీలో చేరారు. చింతర్లంకలో కూడా సమ్మెట మోహన్‌రావు తమ కుటుంబాలతో కలసి టీడీపీని వీడి వైఎస్సార్ సీపీ తీర్థం పుచ్చుకున్నారు. వారికి పార్టీ కండువాలు కప్పి అశోక్‌బాబు సాదరంగా ఆహ్వానించారు. పార్టీ మండల కన్వీనర్ సూర్యదేవర రామకృష్ణ, సర్పంచ్ సనక వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పాలన జగనన్నకే సాధ్యం

- చంద్రబాబు హామీలు ఆచరణ అసాధ్యం
- వైఎస్సార్ సీపీ పర్చూరు అభ్యర్థి యడం బాలాజీ



స్వర్ణ గ్రామం ఎన్నికల ప్రచారంలో అభ్యర్థి యడం బాలాజీ, ఎంపీపీ వాసుబాబు

స్వర్ణ (కారంచేడు): గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం.. రాజన్న రాజ్యం.. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే సాధ్యమని వైఎస్సార్ సీపీ పర్చూరు అసెంబ్లీ అభ్యర్థి యడం బాలాజీ పేర్కొన్నారు. గురువారం రాత్రి ఆయన మండలంలోని స్వర్ణ, రంగప్పనాయుడువారిపాలెం గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎంపీపీ నీరుకట్టు వాసుబాబు ఆధ్వర్యంలో స్వర్ణ కాలువ సెంటర్ నుంచి అన్ని ప్రధాన వీధుల్లో బాలాజీకి పూలవర్షంతో స్వాగతం పలికారు. మహిళలు హారతులు పట్టారు. చంద్రబాబు ఇచ్చిన హామీలు ఆచరణ సాధ్యం కాదని బాలాజీ స్పష్టం చేశారు. కూటమి మోసగాళ్లకు తగిన బుద్ధి చెప్పాలని ప్రజలకు పిలుపునిచ్చారు. 13న ఎన్నికల్లో ఎంపీగా నందిగం సురేష్‌ను, ఎమ్మెల్యేగా తనను ఫ్యాను గుర్తుపై రెండు ఓట్లు వేసి గెలిపించాలన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత జగనన్న పేద ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చి తీరుతారని స్పష్టం చేశారు. జువ్వా శివరామప్రసాద్, మండల కన్వీనర్ చౌదరిబాబు, సర్పంచ్ మధుసూదనరావు, ఎంపీటీసీ బాబు, కో–ఆప్షన్ సభ్యుడు నూర్ అహ్మద్, సతీషబాబు, సర్పంచ్ అనిల్, సింగయ్య, బుల్లెబ్బాయి, మోహనకృష్ణ, జేసీఎస్ కన్వీనర్ శ్రీకాంత్, పాపారావు, ధర్మానందరావు, సుబ్బారెడ్డి, నాగరాజు, శ్రీనివాస రెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, కుమారి, మహేష్, చినబాబు, ఇష్మాయేలు, మురళీమోహన్, శ్రీనివాసరావు, రమేష్, రామాంజనేయులు, సందీప్ పాల్గొన్నారు.

టీడీపీ మేనిఫెస్టో మోసపూరితం

చీరాల వైఎస్సార్ సీపీ అభ్యర్థి కరణం వెంకటేష్



కరణం వెంకటేష్ సమక్షంలో పార్టీలో చేరిన వివిధ పార్టీల నాయకులు

చీరాల: వైఎస్సార్ సీపీ మేనిఫెస్టో నిజమైందని, టీడీపీ మేనిఫెస్టో మొత్తం మోసపూరితమని చీరాల వైఎస్సార్ సీపీ అసెంబ్లీ అభ్యర్థి కరణం వెంకటేష్ పేర్కొన్నారు. గురువారం మున్సిపాలిటీలోని 17వ వార్డులో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అనంతరం పలు సంఘాల సభ్యులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ప్రతి ఇంటికి వెళ్లి జగనన్న ప్రభుత్వంలో జరిగిన మేలును, పేదలకు అందిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా కరణం వెంకటేష్ మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ మరోసారి అధికారంలోకి వస్తే ప్రతి పేద కుటుంబానికి మేలు జరుగుతుందన్నారు. చీరాల నియోజకవర్గంలో కనీవిని ఎరుగని రీతిలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు నిర్వహించి, ప్రజలకు అందుబాటులో నిలిచామని పేర్కొన్నారు. మే 13న జరిగే ఎన్నికల్లో ఫ్యాను గుర్తుకు రెండు ఓట్లు వేసి, ఎమ్మెల్యే అభ్యర్థిగా తనను, బాపట్ల ఎంపీ అభ్యర్థి నందిగం సురేష్‌ను గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్లు చీమకుర్తి బాలకృష్ణ, గుంటూరు మాధవరావు, గుంటూరు ప్రభాకరరావు, కె.పూర్ణచంద్రరావు, కాటా శివరాం ప్రసాద్, ఎ.లీల, నారాయణ, జగన్, మురళీ, శ్రీనివాసరావు పాల్గొన్నారు. అలాగే కొత్తపేట వివేకానంద కాలనీకి చెందిన టి.రంగారావు, అంజమ్మ కరణం వెంకటేష్‌కు మద్దతు ప్రకటించారు. చీరాల మండలం ఓడరేవులోని చిన్నబరప ప్రాంతానికి చెందిన 50 కుటుంబాలు వైఎస్సార్ సీపీకి జైకొట్టాయి. వెంకటేష్‌ను కలిసి తమ సంపూర్ణ మద్దతు ప్రకటించాయి. పలు విభాగాల నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

జగనన్న మళ్లీ సీఎం కావడమే లక్ష్యం

ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు సువర్ణరాజు



బాపట్ల: సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్ర వ్యాప్తంగా వైఎస్సార్ సీపీకి పూర్తి మద్దతు ఇస్తున్నట్లు ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు దాసరి సువర్ణరాజు ప్రకటించారు. బాపట్లలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలన అద్భుతమని కితాబిచ్చారు. దళితుల అభివృద్ధికి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు దేశంలోనే ఎక్కడా లేవని కొనియాడారు. తన స్వార్థం కోసం మంద కృష్ణ మాదిగ మాదిగ జాతిని బీజేపీకి తాకట్టు పెట్టారని విమర్శించారు. ఎన్నో ఏళ్లుగా ఎమ్మార్పీఎస్ ఉద్యమాన్ని నడుపుతున్న కృష్ణ మాదిగ ఎందుకు ఎస్సీ వర్గీకరణ చేసేందుకు కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురాలేదని ప్రశ్నించారు. దళిత జాతి అభ్యున్నతి సీఎం జగన్‌తోనే సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో వై. సుజిత్ కుమార్, తాతపూడి మనోహర్, యాసిన్ తదితరులు పాల్గొన్నారు.

'పింఛను' బాధలు




కొల్లూరు యూనియన్ బ్యాంక్‌లో గుంపులుగా లబ్ధిదారులు



స్టేట్‌బ్యాంక్ మిని పాయింట్ వద్ద దుకాణాల అరుగులపై పడిగాపులు

కొల్లూరు : ఆధార్ కార్డుకు అనుసంధానమైన పింఛనుదారుల బ్యాంకు ఖాతాలకు పింఛను నగదు జమ చేయాలన్న ఎన్నికల కమిషన్ ఆదేశాలతో ప్రభుత్వం నగదు జమ చేసింది. పింఛనుదారులు ఆ నగదును తీసుకునేందుకు బ్యాంకుల వద్ద పడిగాపులు కాశారు. కొల్లూరు మండలంలో 9,277 మంది పింఛనుదారులకు 6,870 మందికి మాత్రమే బ్యాంక్ ఖాతాల్లో నగదు జమ అయ్యింది. గ్రామీణ ప్రాంతాల బ్యాంకులకు వృద్ధులు, దివ్యాంగులు ఉదయం 9గంటలకే చేరుకుని బారులు తీరారు. లబ్ధిదారాల్లో అధికశాతం నిరక్షరాసులు కావడంతో నగదు ఉప సంహరణ పత్రాలు రాసేందుకు ఒకింత ఇబ్బందులు పడ్డారు.

టీడీపీని చావుదెబ్బ తీయండి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బ్రహ్మణ సంఘ నాయకులు

పట్నంబజారు: సమాజ హితం కోరుకునే బ్రాహ్మణ జాతి విద్వేషి చంద్రబాబు అని ప్రభుత్వ సలహాదారు, రాష్ట్ర బ్రాహ్మణ సంఘం నేత జ్వాలాపురం శ్రీకాంత్ ధ్వజమెత్తారు. కరణాల ఉసురు తీసి, అర్చకులను అవహేళన చేసి, ధూప దీప నైవేద్యాలకు దూరంగా అనేక ఆలయాలను పాడుబెట్టుకున్న నీచ సంస్కృతి టీడీపీదని మండిపడ్డారు. బృందావన్‌గార్డెన్స్‌లోని శాసనమండలి విప్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ల అప్పిరెడ్డి కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశం నిర్వహించారు. శ్రీకాంత్ మాట్లాడుతూ దేవాలయాలను కూల్చి, సదావర్తితో సహా అనేక సత్రాలు, ఆలయ భూములను అన్యాక్రాంతం చేసి, అన్ని రంగాలలో బ్రాహ్మణ జాతిని అణగదొక్కిన టీడీపీకి గుణపాఠం నేర్పించాల్సిన సమయం ఆసన్నమైందని పిలుపునిచ్చారు. 2019లో చెంప పెట్టులా తీర్పునిచ్చినా సిగ్గు లేకుండా నానా జాతి సమితిని కూడగట్టుకుని మళ్లీ ఎన్నికల బరిలో దిగిన టీడీపీని ఈసారి చావుదెబ్బ తీసేందుకు బ్రాహ్మణులంతా ఐక్యంగా నిలబడి సత్తా చాటాలని కోరారు. దివంగత మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాతే బ్రాహ్మణులకు మేలు జరగడం మొదలైందని వివరించారు. బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ పెరి కామేశ్వరరావు మాట్లాడుతూ తెలుగుదేశం హయాంలో తూతూ మంత్రంగా నడిచిన బ్రాహ్మణ కార్పొరేషన్‌ను బలోపేతం చేసి తద్వారా రూ.780 కోట్ల మేరకు బ్రాహ్మణులకు ఆర్థిక లబ్ధి చేకూర్చినట్లు వెల్లడించారు.

పార్టీ సీనియర్ నేత బండా రవీంద్రనాథ్ మాట్లాడుతూ టీడీపీని బ్రాహ్మణ వ్యతిరేక పార్టీ అని, బ్రాహ్మణులను అణగదొక్కేందుకే అవతరించిన పార్టీ అని ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సుందరామశర్మ, కార్పొరేటర్ ఈచంపాటి వెంకటకృష్ణ(ఆచారి), పలు బ్రాహ్మణ సంఘాల నాయకులు కప్పగంతు ఆదిలక్ష్మి, చింతపల్లి రమణ, వలివేటి వెంకటరమణ, పాత్తూరి శ్యాంసుందర్, బందా ఆంజనేయప్రసాద్, దామరాజు శ్రీనివాస్, ఎంవీ సుధాకర్ పాల్గొన్నారు.

రామాలయంలో భారీ అన్నసంతర్పణ

బాపట్ల: బాపట్ల పట్టణంలోని కాకుమానువారిపాలెంలో వేంచేసియున్న శ్రీరాములవారి కల్యాణ మహోత్సవం అనంతరం 16 రోజుల పండుగను శాస్త్రోక్తంగా గురువారం నిర్వహించారు. స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు గుండ్రెడ్డి శివ ఆధ్వర్యంలో ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నసంతర్పణ కార్యక్రమం చేపట్టారు. ప్రతి ఏడాది స్వామి వారి కల్యాణ మహోత్సవం అనంతరం 16 రోజుల పండుగ నిర్వహించటం సంప్రదాయంగా కొనసాగుతుందని శివ తెలిపారు. ఈ కార్యక్రమంలో అలపర్తి శ్రీనివాసరావు,నాగేశ్వరరావు, లక్ష్మీనారాయణ, పెరుమళ్ళ గోపి తదితరులు ఉన్నారు.

పెమ్మసానికి బుద్ధి చెబుతాం

పట్నంబజారు: టీడీపీ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు బీసీల ద్రోహి అని జాతీయ బీసీ సంఘం రాష్ట్ర యువత అధ్యక్షుడు గూడూరి నాని పేర్కొన్నారు. కృష్ణనగర్‌లోని వైఎస్సార్ సీపీ లోక్‌సభ అభ్యర్థి, కిలారి రోశయ్య నివాసంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బీసీలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి 48 అసెంబ్లీ, 11 పార్లమెంట్ స్థానాలిస్తే.. చంద్రబాబు కేవలం 38 సీట్లుకే పరిమితం చేశారని విమర్శించారు. బీసీలను గుండెల్లో పెట్టుకున్న మంచి మనసున్న వ్యక్తి సీఎం వైఎస్ జగన్ అని కొనియాడారు. అసలు గుంటూరు పార్లమెంట్‌లో ఎన్ని నియోజకవర్గాలు ఉన్నాయో తెలియని పెమ్మసానిని గెలిపిస్తే.. మనకి మనమే ఉరి వేసుకున్నట్లు అవుతుందన్నారు. కిలారి రోశయ్యను గెలిపించుకునేందుకు బీసీలంతా సిద్ధంగా ఉన్నారన్నారు. కార్పొరేటర్ బూసి రాజలత, బీసీ విభాగం నేత పోకల వసంత్ మాట్లాడారు. అనంతరం జై బీసీ.. వన్స్‌మోర్ వైఎస్సార్ సీపీ అనే పోస్టర్‌లను ఆవిష్కరించారు. శివశంకర్‌యాదవ్, వేణు పాల్గొన్నారు.

వర్ధిల్లు, శోభిల్లు.. మా నెమలికల్లు..!

రాష్ట్రంలో 2019 అనంతరం పల్లెల్లో అభివృద్ధి పల్లవించింది. గ్రామ స్థాయిలోనే పాలన ఫలాలు ప్రజలకందాలనే లక్ష్యంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వజ్ర సంకల్పం సత్ఫలితాలనిస్తోంది. గ్రామ సచివాలయాల రాకతో ఊళ్లు పాలన నిలయాలయ్యాయి. ప్రభుత్వ పాఠశాలలు కార్పొరేట్ స్థాయిని తలదన్నాయి. రైతు భరోసా కేంద్రాలతో అన్నదాతల అవస్థలు తీరాయి. విలేజ్ క్లినిక్‌ల రాకతో పల్లె ప్రజల ఆరోగ్య ప్రమాణం మెరుగుపడింది. ఇదే తరహాలో అభివృద్ధి ఒరవడి మరో ఐదేళ్లు కొనసాగితే నూతన శకం ఆవిష్కరణ తథ్యమంటున్నారు విశ్లేషకులు. నెమలికల్లులో కనిపిస్తోన్న సంక్షేమాభివృద్ధే ఇందుకు ఓ గొప్ప నిదర్శనం.


సచివాలయ భవనం

నెమలికల్లు ముఖచిత్రం

విస్తీర్ణం(ఎకరాల్లో) -	3,480
జనాభా -	2,750
మహిళలు -	1,120
పురుషులు -	1,130

విభాగం	వెచ్చించిన నిధులు (రూ. లక్షల్లో)
సచివాలయం	43.5
షాదీఖానా	40
ఓవర్ హెడ్ ట్యాంక్	30
రైతు భరోసా కేంద్రం	21.80
అంతర్గత రోడ్లు	55
పాఠశాలల అభివృద్ధి	40
బీసీ సామాజిక భవనం	20
ఎరువుల గోదాం	25
సైడ్ డ్రెయిన్లు	30
ఈద్గా	10
చెరువు అభివృద్ధి	15
జల్ జీవన్ మిషన్	45


సీసీ రోడ్డు

అమరావతి: గత పాలకుల నిర్లక్ష్యంతో మౌలిక వసతులకు దూరంగా ఉన్న నెమలికల్లు గ్రామం ఇప్పుడు ప్రగతి పరవళ్లు తొక్కుతోంది. రూ.31 కోట్లు సంక్షేమ పథకాల రూపంలో నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో జమయ్యాయి. మరో రూ.11 కోట్లు మౌలిక వసతుల కల్పనకు కేటాయించారు. ఇప్పుడు ఏ మూలకు వెళ్లినా ప్రభుత్వ కార్యాలయాలు కనిపిస్తున్నాయి. పాఠశాలలు నూతన శోభను సంతరించుకుంటున్నాయి. గ్రామ సచివాలయం, ఆర్బీకే, ఎరువుల గోదాం, బీసీల సామాజిక భవనం, ఓవర్ హెడ్ ట్యాంక్ ఇలా ఒకటేమిటి.. అన్ని విభాగాల రాకతో 'మా ఊరు వర్ధిల్లుతోంది. అన్ని హంగులతో శోభిల్లుతోంది.' అంటూ ఆ గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సీఎం వైఎస్ జగన్ దార్శనికతకు, స్థానిక ఎమ్మెల్యే నంబూరు శంకరరావు నిర్విరామ కృషికి కృతజ్ఞతలు తెలుపుతున్నారు.


ఓవర్ హెడ్ ట్యాంక్


బీసీ కమ్యూనిటీ హాల్



నాడు-నేడులో అభివృద్ధి చేసిన ప్రాథమిక పాఠశాల

మా కాలనీ బాగుపడింది



మా కాలనీలో తాగునీటికి గతంలో ఎన్నో ఇబ్బందులు పడ్డాం. రోడ్లపై మురుగు పారి, దోమలు బెడద తట్టుకోలేకపోయాం. జగనన్న పాలనలో ఇంటింటికి మంచినీటి కొళాయి వచ్చింది. రోడ్ల మీద మురుగును సైడ్ డ్రెయిన్లతో మళ్లించి సమస్యను పరిష్కరించారు. బడి బాగు చేయించి, పిల్లలకు మంచి భోజనం పెడుతున్నారు.

– బుల్లా చంద్రశేఖరరావు, ఎస్సీ కాలనీ, నెమలికల్లు

మార్పు తీసుకొచ్చారు



మా ఊరిలో ముస్లింలకు సౌకర్యంగా ఈద్గా కట్టించారు. ఎమ్మెల్యే నంబూరు శంకరరావు చొరవతో షాదీఖానా నిర్మించారు. సీసీ రోడ్లు, డొంక రోడ్డు వేసి గ్రామంలో ఎంతో మార్పు తీసుకొచ్చారు.

– షేక్ ఖాశిం, ముస్లిం కాలనీ, నెమలికల్లు

అభివృద్ధి చేసుకున్నాం



ఎమ్మెల్యే నంబూరు శంకరరావు సహకారంతో వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో మా గ్రామాన్ని అభివృద్ధి చేసుకున్నాం. రూ.31కోట్లతో సంక్షేమ పథకాలు, రూ.11 కోట్ల నాన్ డీబీటీ సాయం గ్రామస్తులకు అందింది. రూ.2.95 కోట్లతో ప్రభుత్వ భవనాలొచ్చాయి. నరుకుళ్ళపాడు సొసైటీ ద్వారా ఎరువుల గొడౌన్ నిర్మించుకున్నాం.

– కోవూరి చినరాంబాబు, సర్పంచ్, నెమలికల్లు

ఈవీఎంల కమిషనింగ్



నాదెండ్ల: గణపవరం చుండి రంగనాయకులు ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం ఈవీఎంల కమీషనింగ్ నిర్వహించారు. రిటర్నింగ్ అధికారి నారదముని ఆధ్వర్యంలో సిబ్బందికి పోలింగ్ బూత్‌లకు ఈవీఎంలు పంపిణీ అవగాహన కల్పించారు. అసెంబ్లీ పరిధిలో 241 పోలింగ్ కేంద్రాలుండగా 289 బ్యాలెట్ యూనిట్లు, 289 కంట్రోల్ యూనిట్లు, 341 వీవీ ప్యాట్‌లు, పార్లమెంటు పరిధిలో 578 బ్యాలెట్ యూనిట్లు, 289 సీయూలు, 341 వీవీ పాట్‌లు ఏర్పాటు చేయనున్నారు. ఏఈఆర్‌వో జ్వాలా నరసింహం ఉన్నారు.

మేనిఫెస్టోను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



భట్టిప్రోలు: అన్ని వర్గాల ప్రజలకు మేలు చేసే వైఎస్సార్ సీపీ ఎన్నికల మేనిఫెస్టోను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఆ పార్టీ వేమూరు ఎమ్మెల్యే అభ్యర్థి వరికూటి అశోక్‌బాబు సోదరుడు డాక్టర్ వరికూటి అమృతపాణి కోరారు. గురువారం భట్టిప్రోలులో జరిగిన ఎన్నికల ప్రచారంలో ఏపీ క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్ చేబ్రోలు మనోరంజని పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమృతపాణి మాట్లాడుతూ గత ఎన్నికల మేనిఫెస్టోలోని ప్రతి అంశాన్ని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేసిందని, ప్రస్తుత మేనిఫెస్టోను కూడా అమలు చేస్తామన్న భరోసా ప్రజల్లో కల్పించాలన్నారు. మండల ఎన్నికల పరిశీలకుడు కొండా శివప్రసాద్ రెడ్డి, సర్పంచ్ రవికిరణ్మయి, జెడ్పీటీసీ తిరువీధుల ఉదయభాస్కరి, ఎంపీటీసీ సుశీల, పద్మావతి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ నాని, పంచాయతీ వార్డు సభ్యులు పాల్గొన్నారు.

టీడీపీ ప్రచారంలో అంగన్‌వాడీ ఆయా



శావల్యాపురం: మండల కేంద్రం శావల్యాపురం ఎస్టీ కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో ఆయాగా పనిచేస్తున్న యకమ్మ చిన్నమ్మాయి టీడీపీ ఎన్నికల ప్రచారంలో పాల్గొంది. ఈ విషయంపై సీడీపీవో ముదివర్తి అనురాధను వివరణ కోరగా.. రాజకీయ కార్యక్రమాల్లో పాల్గొనరాదని ముందస్తు సమాచారం ఇచ్చినట్లు తెలిపారు. ఎన్నికల నియమావళి పాటించని ఆయాపై చర్యలు తీసుకుంటామన్నారు.

జగనన్నను గెలిపించుకుందాం

వడ్డెర కార్పొరేషన్ చైర్‌పర్సన్ దేవళ్ల రేవతి



దాచేపల్లి: సంక్షేమ రథసారథి జగనన్నని మరోసారి గెలిపించాలని వడ్డెర కార్పొరేషన్ చైర్‌పర్సన్ దేవళ్ల రేవతి ప్రజలను కోరారు. స్థానిక నగర పంచాయతీ చైర్‌పర్సన్ కొప్పుల సుబ్బమ్మతో కలిసి 10వ వార్డులో గురువారం ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. జగనన్న ఐదేళ్ల పాలన స్వర్ణ యుగమని, అవినీతికి తావివ్వకుండా సంక్షేమ పథకాల లబ్ధి చేకూర్చిన ఘనత ఆయనకే దక్కుతుందని కొనియాడారు. ప్రజలంతా ఒక్కసారి ఆలోచన చేయాలని, ఫ్యాను గుర్తుకే ఓటు వేసి గురజాల ఎమ్మెల్యే అభ్యర్థి కాసు మహేష్‌రెడ్డిని, నరసరావుపేట ఎంపీ అభ్యర్థి డాక్టర్ పి.అనిల్‌కుమార్ యాదవ్‌ని గెలిపించుకోవాలని ఓటర్లను అభ్యర్థించారు. అలాగే 1వ వార్డులో వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ షేక్ సుభానీ, మాజీ కన్వీనర్ మునగా పున్నారావు, కౌన్సిలర్ చాట్ల క్రాంతికుమార్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ సభ్యుడు కొప్పుల సాంబయ్య, ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పేరుపోగు రాజశేఖర్, నాయకులు తిరుపతిరెడ్డి, ఏసుపాదం, బుజ్జి, కోటయ్య, అఖిల్, దిబ్బయ్య, కరుణకర్, శ్రీనివాసరావు, కొండలు పాల్గొన్నారు.

నంబూరుకు మాదిగ మహా సేన మద్దతు

పెదకూరపాడు: వైఎస్సార్ సీపీ పెదకూరపాడు నియోజకవర్గ అభ్యర్థి నంబూరు శంకరరావుకు మద్దతుగా మాదిగ మహా సేన అధ్యక్షుడు కొరిటిపాటి ప్రేమ్‌కుమార్ రంగంలోకి దిగారు. ఆయన ఆధ్వర్యంలో మండలంలోని జలాల్‌పురం గ్రామంలో మాదిగ ఆత్మీయ సమావేశం బుధవారం నిర్వహించారు. సంక్షేమ పథకాల కర పత్రాలను అందించారు. గడప గడపకు తిరిగి సీఎం జగన్, ఎమ్మెల్యే అభ్యర్థి నంబూరు శంకరరావుకు ఎందుకు ఓటు వేయాలో వివరించారు.

టీడీపీ విందు రాజకీయం



సత్తెనపల్లి: సార్వత్రిక ఎన్నికల్లో ఓటమి తప్పదని భావిస్తున్న టీడీపీ అభ్యర్థులు అడ్డదారులూ తొక్కుతున్నారు. ఓటర్లను మచ్చిక చేసుకునేందుకు ఆత్మీయ సమావేశాల పేరుతో డబ్బులు, గిఫ్ట్‌లతో ప్రలోభ పెడుతున్నారు. ఆత్మీయ సమావేశాల పేరుతో విందు ఇచ్చి, కూపన్లు పంపిణీ చేస్తున్నారు. అనంతరం ఆ కూపన్లు తీసుకొని ఒక్కొక్కరికి రూ. 2 వేలు చొప్పున నగదు, స్వీట్ బాక్స్ అందిస్తున్నారు. పట్టణంలోని కాకతీయ కల్యాణ మండపంలో గురువారం ఆర్‌ఎంపీలు, పీఎంపీల ఆత్మీయ సమావేశంను స్వతంత్ర ల్యాబ్ నిర్వాహకుడు బాషా, రైల్వేస్టేషన్ సమీపంలోని ఆర్‌ఎంపీ హనుమంతురావు, పాత బస్టాండ్‌లోని ఆర్‌ఎంపీ బాష ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సమావేశానికి 300 మందికి పైగా హాజరయ్యారు. స్వతంత్ర ల్యాబ్ పేరుతో ముద్రించిన కూపన్లు పంపిణీ చేశారు. అనంతరం వారందరికీ విందు ఇచ్చారు. ఆ కూపన్‌లు తీసుకొని ఒక్కొక్కరికి రూ. 2 వేలు చొప్పున నగదు, ఒక స్వీట్ బాక్స్ పంపిణీ చేసి టీడీపీకి ఓటు వేయాలని, వైద్యం నిమిత్తం వచ్చే రోగులను కూడా ప్రభావితం చేయాలని సూచించారు. సమావేశానికి ముందు ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు వచ్చి కొద్దిసేపు చూసి చూడనట్లుగా వ్యవహరించి, సరిగ్గా డబ్బు, స్వీట్ బాక్స్‌లు పంపిణీ చేసే క్రమంలో అక్కడి నుంచి వెళ్లిపోయారు.

బిల్లులు లేని కాంగ్రెస్ ప్రచార సామగ్రి స్వాధీనం

పట్నంబజారు: ఎటువంటి బిల్లులు లేకుండా ట్రావెల్స్‌లో వచ్చిన పార్టీ జెండాలను ఎన్నికల అధికారులు స్వాధీనం చేసుకున్నారు. పోలీసులకు ఫిర్యాదు చేయడంతో గురువారం కేసు నమోదైంది. కొత్తపేట పోలీసుల వివరాల మేరకు.. హైదరాబాద్ నుంచి గుంటూరుకు కావేరి ట్రావెల్స్ బస్సులో గురువారం తొమ్మిది గోతాల్లో కాంగ్రెస్ పార్టీకి సంబంధించిన జెండాలు, టోపీలు, కీచైన్‌లు తదితరాలు వచ్చాయి. ఈ క్రమంలో ఎటువంటి బిల్లులు లేకపోవడం గమనించిన అధికారులు వాటిని సీజ్ చేశారు. ఎఫ్‌ఎస్‌టీ అధికారుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. గోతాల్లో ఉన్న సామగ్రి విలువ రూ.60,500 ఉంటుందని తెలిపారు.


ఒడియం పెడతా..ప్రత్యర్థిని ఓడిస్తా: ఒడియాలు పెడుతున్న గుంటూరు తూర్పు అభ్యర్థి నూరి ఫాతిమా



టీ కొట్టు.. పశ్చిమ వైఎస్సార్ సీపీకి తెచ్చిపెట్టు: గుంటూరు పశ్చిమ ప్రచారంలో ఓ దుకాణంలో టీ అందిస్తున్న ఎమ్మెల్యే గిరిధర్


కొండనైనా ఢీకొట్టే మనోబలం కావాలి: ఆలయంలో ఆశీర్వాదం పొందుతున్న మంగళగిరి అభ్యర్థి మురుగుడు లావణ్య


ఎంతటి వారినైనా మడతెట్టేస్తా: ఓ షాపులో ఇస్త్రీ చేస్తున్న నరసరావుపేట ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి


ప్రజల ప్రేమను గెలుస్తాం: విశ్వేశ్వరంలోని చర్చిలో ఎంపీ మోపిదేవి, రేపల్లె అభ్యర్థి డాక్టర్ ఈవూరి గణేష్ ప్రత్యేక ప్రార్థనలు

ప్రజాక్షేత్రం.. ప్రచార మంత్రం

నీ భవిష్యత్తు బంగారం: చిన్నారిని ఎత్తుకున్న అద్దంకి అభ్యర్థి పానెం చిన హనిమిరెడ్డి



భాష్యంకు ఎదురుగాలి

- పక్షంలో మూతపడిన జనసేన ఎన్నికల కార్యాలయం
- బీజేపీ నేతలకు రుచించని అంటీముట్టని వ్యవహారం
- సొంత వర్గానికి ప్రాధాన్యం.. ఇతరులపై పలుచని భావం
- టీడీపీ విజయానికి.. కాకి లెక్కలపైనే నమ్మకం
- పెదకూరపాడులో జోరుగా వీస్తున్న ఫ్యాను గాలి
- అందరివాడిలా దూసుకుపోతున్న నంబూరు శంకరరావు


గ్రామ గ్రామాన వైఎస్సార్ సీపీ అభ్యర్థి, ఎమ్మెల్యే నంబూరు శంకరరావుకు బ్రహ్మరథం పడుతున్న గ్రామస్తులు

అచ్చంపేట: పెదకూరపాడు నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ అభ్యర్థి భాష్యం ప్రవీణ్‌కు ఎదురుగాలి వీస్తోంది. ఆయన ఇంతవరకు అన్ని గ్రామాల్లో ఒక్కసారి కూడా పర్యటించకపోవడం, కార్యకర్తలతో అంటీముట్టనట్లు వ్యవహరించడం మైనస్‌గా చెప్పవచ్చు. సొంత సామాజికవర్గం వారికే ప్రాధాన్యం ఇస్తున్నారనే విమర్శల వల్ల కాస్తో కూస్తో మద్దతుగా ఉన్న పలు సామాజిక వర్గాల ఓటర్లంతా టీడీపీకి దూరమవుతున్నారు.

పక్షంలో పార్టీ కార్యాలయం క్లోజ్..

నియోజకవర్గంలో జనసేన పార్టీలోని కాపు నాయకులంతా టీడీపీ అభ్యర్థిపై నమ్మకం సన్నగిల్లి.. వైఎస్సార్ సీపీకి క్యూ కడుతున్నారు. అచ్చంపేటలో భారీ ర్యాలీతో అట్టహాసంగా ఏర్పాటు చేసిన మండల జనసేన ఎన్నికల కార్యాలయాన్ని 15 రోజులు కూడా గడవకముందే ఎన్నికలు సమీపిస్తున్న వేళ మూసేయడం చర్చనీయాంశంగా మారింది. ఆ పార్టీలో నాయకుల నేవారంతా ఇప్పటికే వైఎస్సార్ సీపీ అభ్యర్థి నంబూరు శంకరరావుకు జై కొట్టారు. 2019 ఎన్నికల్లో నియోజకవర్గంలో జనసేనకు 7000కు పైగా ఓట్లు, బీజేపీకి 1,100 ఓట్లు పడ్డాయి. తాము కూటమిగా కట్టాము కాబట్టి ఆ రెండు పార్టీల ఓట్లు మొత్తం తమకే వస్తాయని కాకి లెక్కలేసుకుంటున్న టీడీపీ ఆశలు ఆవిరైపోయాయి. కాపులంతా చాలా వరకు ఇప్పటికే వైఎస్సార్ సీపీలో చేరారు. మిగిలిన వారు కూడా ఎన్నికల తేదీ నాటికి చేరే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇక బీజేపీ నాయకులు ఒక్కరు కూడా టీడీపీ ప్రచారంలో కనిపించడం లేదు. కొంతమంది కరుడుకట్టిన బీజేపీ నేతలను టీడీపీ అభ్యర్థిని అని చెప్పుకునే భాష్యం ప్రవీణ్ కనీసం ఒక్కసారైన కలవకపోవడంతో దూరంగా ఉంటున్నారు.

చేరికలు ఓ అభూత కల్పన

ప్రస్తుతం టీడీపీలో ఉన్న వారినే రోజుకు కొంతమంది చొప్పున పార్టీలో చేర్చుకుంటూ.. పచ్చ కండువాలు కప్పి, పచ్చ మీడియాలో ప్రచారం చేసుకుంటున్నారు. కొంతమంది వైఎస్సార్ సీపీ మద్దతుదారులను డబ్బు ఆశతో ప్రలోభపెట్టి, బలవంతకంగా తీసుకువెళ్లి పచ్చ కండువాలు కప్పి ఫొటోలు తీయించుకుంటున్నారు. వారంతా తమను బలవంతంగా తీసుకెళ్లి కండువాలు కప్పారంటూ తిరిగి వైఎస్సార్ సీపీలో చేరిపోతున్నారు.

దూసుకుపోతున్న నంబూరు

సిట్టింగ్ ఎమ్మెల్యే నంబూరు శంకరరావు తనదైన శైలిలో ప్రచారంలో దూసుకుపోతున్నారు. ఏ గ్రామం వెళ్లినా సంక్షేమ లబ్ధి పొందిన వారంతా కృతజ్ఞతా భావంతో స్వాగతం పలుకుతున్నారు. మహిళలు హారతులుపడుతున్నారు. ఎమ్మెల్యే తరఫున సతీమణి నంబూరు వసంతకుమారి, తనయుడు నంబూరు కల్యాణ్ చక్రవర్తి గ్రామ గ్రామాన ప్రచారం చేస్తున్నారు. గత ఐదేళ్లలో ఏ గ్రామంలో ఎంత అభివృద్ధి జరిగింది, ఎంతమంది లబ్ధి పొందారు అనే విషయాలను ఇంటింటికీ తిరిగి లెక్కలతో సహా వివరిస్తున్నారు. వచ్చే ఐదేళ్లో ఏం చేయబోతున్నారో కూడా చెప్తూ.. ఓటు అభ్యర్థిస్తున్నారు. సీఎం జగన్ అయితేనే అమలవుతున్న సంక్షేమ పథకాలు యథావిధిగా కొనసాగుతాయని ఓటర్ల మద్దతు కూడగడుతున్నారు. దీనికి తోడు ఎమ్మెల్యే శంకరరావు ఏ మచ్చా లేని నాయకుడని, జగన్ లాగానే హామీలను ఎంత కష్టమైనా నెరవేరుస్తారనే నమ్మకం ప్రజల్లో నాటుకుపోయింది. దీంతో టీడీపీ, వైఎస్సార్ సీపీ అభ్యర్థుల మధ్య ఉన్న వ్యత్యాసాన్ని ఓటర్లు చాలా సున్నితంగా గమనిస్తున్నారు. సంక్షేమాభివృద్ధికి మరోమారు పట్టం కట్టేందుకు సిద్ధంగా ఉన్నారు.

పశ్చిమలో మాదిగలందరి మద్దతు రజినమ్మకే

- మద్దతు ప్రకటించిన మాదిగ సంఘాల ఐక్య వేదిక


మాట్లాడుతున్న అత్తోట జోసఫ్, నాయకులు

పట్నంబజారు: గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో మాదిగలందరి మద్దతు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి విడదల రజినీకే అని వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి అత్తోట జోసఫ్ స్పష్టం చేశారు. గుంటూరు చంద్రమౌళి నగర్‌లోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో గురువారం మాదిగ సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అత్తోట జోసఫ్ మాట్లాడుతూ గత ఎన్నికల్లో కూడా గుంటూరు నగరంలోని మాదిగల్లో 70 శాతం వైఎస్సార్ సీపీకే ఓటు వేశారని తెలిపారు. జగనన్న ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల ద్వారా ఏకంగా 95 శాతానికి పైగా మాదిగ సామాజికవర్గం ప్రయోజనం పొందిందని చెప్పారు. చంద్రబాబు సీఎంగా ఉన్న సమయంలో తాము మాదిగ కురుక్షేత్ర మహా సభ పెడితే తమపై కేసులు పెట్టారని గుర్తుచేశారు. జగనన్న సీఎం అయ్యాక ఆ కేసులు ఎత్తివేశారని తెలిపారు. చంద్రబాబు మళ్లీ మాదిగ సామాజిక వర్గీకరణ జిల్లాల వారీగా చేస్తానని చెప్పడం మరో మోసపు వాగ్దానమని ఎండగట్టారు. మంత్రి రజిని చిలకలూరిపేటలో ఎస్సీలకు మార్కెట్ యార్డు చైర్మన్ పదవి ఇచ్చి, గౌరవించారని గుర్తుచేశారు.

ట్రక్కు డ్రైవర్, కూలీకి ఎమ్మెల్యే టికెట్లు

మాదిగ లాయర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పుసులూరి జీవరత్నం మాట్లాడుతూ ఈ ఎన్నికల్లో మాదిగ సామాజిక వర్గానికి చెందిన అతి సామాన్యులైన ట్రక్కు డ్రైవర్, ఒక ఉపాధి హామీ పథకం కూలీకి ఎమ్మెల్యే టికెట్లు ఇచ్చిన ఘనత జగనన్నదేనన్నారు. మాదిగ జాతిని చంద్రబాబుకు తాకట్టు పెట్టాలని మంద కృష్ణ మాదిగ చూస్తున్నారని ధ్వజమెత్తారు. వర్గీకరణ విషయం కోర్టులో ఉన్నందున, ఎవరెన్ని కల్లబొల్లి కబుర్లు చెప్పినా నమ్మవద్దని తెలిపారు. గుంటూరు పశ్చిమలో మంత్రి విడదల రజినిని కచ్చితంగా గెలిపించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కో-కన్వీనర్ డొక్కా జార్జి, లీగల్ సెల్ నాయకుడు పచ్చల విజయానంద్, ఎస్సీ సెల్ జిల్లా కార్యదర్శి అచ్చిబాబు, మార్కెట్ యార్డు డైరెక్టర్లు గుంజర ప్రభు, దర్శనపు బెంజిమన్ నాయకులు రవికుమార్, రూబెన్, ఎస్సీ నేతలు జాబాబు, లూర్దురాజు, స్వామి పాల్గొన్నారు.

నా బిడ్డను ఆశీర్వదించండి


కరపత్రం అందిస్తున్న పీఆర్కే తల్లి రాములమ్మ

కారెంపూడి: ఎల్లప్పుడూ ప్రజా సమస్యల పరిష్కారానికే పరితపించే తన బిడ్డను మరోసారి ఆశీర్వదిస్తే ఇంకా అభివృద్ధి చేస్తాడని మాచర్ల వైఎస్సార్ సీపీ అభ్యర్థి పిన్నెల్లి రామకృష్ణారెడ్డి తల్లి పిన్నెల్లి రాములమ్మ ప్రజలను కోరారు. కుమార్తె జవ్వాజి నాగమణితో కలసి గురువారం మండలంలోని ఒప్పిచర్ల గ్రామంలో ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎంపీపీ బొమ్మిన సావిత్రి, మాజీ సర్పంచ్ రామదేని లక్ష్మీ వెంటరాగా..ఇంటింటికీ వెళ్లి ఫ్యాను గుర్తుకు ఓటేయాలని, ఎంపీ అభ్యర్థి అనిల్‌కుమార్ యాదవ్‌ను గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. మాజీ ఎంపీపీ చినవెంకట నర్సయ్య, ఎంపీటీసీ అనంత రామయ్య, ఆంజనేయులు, రామయ్య, శ్రీను, దోర్నాల సాంబిరెడ్డి, చిలుకూరి చంద్రశేఖరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.